# గోమాత

మనది "గోభూమి" అని అందరూ అనుకుంటారు. మీరుకూడా అదేవిధంగా చెబుతూ వుంటారు; గోపూజకు మనదేశం ప్రసిద్ధి— అని పలువురు చెప్పుకోవటం నేను విన్నాను. మీరు మాటాడితే "కామధేనువు, కల్పవృక్షం" అనటం కూడా నేను ఎరుగుదును. కాని నిజంగా మీరు ఈ దేశంలోని గోవుల సంగతి ఆలోచిస్తున్నారా?

మీరు పూజలు చేస్తున్నామని చెప్పుకునే గోవులలో నేనొకదాన్ని. నన్ను చూడండి. నేను మీచేత పూజలు అందుకుంటున్నదానికివలె ఉన్నానా? నాది నడివయసే అయినప్పటికి, అడుగువేయలేకుండా ఉన్నాను. నా శరీరం నాకే భారంగా వుంది. నా యజమాని నాముందు పడిలించే నాల్గు పరకలే, కొరుకుడు పడని స్థితిలో ఉన్నాను. పూర్వం ఒకప్పుడు మా జాతిని కన్నతల్లులను చూచుకున్నట్లు చూచుకునేవారు. గోవు యెదురుపడితే అదృష్టం అనుకునేవారట. ఇంటిలో గోవు ఒకటివుంటే ఇల్లంతా కళకళలాడుతున్నట్లు సంబరపడేవారట. ఇప్పుడాభావం యేది ?

పోనీ మీరే చెప్పండి. మీకు అనేకచోట్ల నాజాతి కనిపిస్తూనే వుంటుంది. అవి మీచేత పూజింపబడుతున్నట్టుగానే ఉన్నాయా? ఈసురోమని, అంటుడొక్కలతో తిరిగేవాటిని మీరు శ్రద్ధగా చూచివుండరు. వాటి కళ్ళల్లోని వేదన మీరు గమనించి వుండరు.

వేటి సంగతో దేనికి? నా సంగతి చెప్పుకుంటాను. కాస్త ఓపికపట్టి వింటారా? నన్ను నా యజమాని ఒక సంతలోకొని, తన కొట్టంలోనికి తోలుకొని వచ్చాడు. అంతకుముందు నన్ను పెంచిన యజమాని పూర్వకాలపు మనిషి. నన్ను పువ్వులలో పెట్టి పెంచినట్లు పెంచాడు. ప్రతిరోజూ తెల్లవారకముందే లేచి, పనిపాటల్లోకి వెళ్ళకముందు, నన్ను లేపి, నా మేను నిమిరి నా ముందు జనపకట్టవేసి, నా దగ్గరబాగుచేసి, నామొహంలోకి

ఒక్కసారి చూచి మరీ వెళ్ళేవాడు ఉదయం లేచి నా మొహం చూడకుండా ఎవరి మొహం జూచేవాడుకాదు. నన్ను చూచి బయటకు వెళితే పనులన్నీ యిట్టే అయిపోయేవట ఆయనకి. అదీ ఆయన నమ్మకం. వచ్చినవారందరికీ నన్ను చూపి, 'ఇది మాయింటి శ్రీమహాలక్ష్మి. ఇది వున్నచోట ఏకొరతా వుండదు. దీన్ని నేను ఏ పరిస్థితిలోనూ విడువను' అని చెబుతూ వుండేవాడు.

ఈ మాట ఆయన పదేపదే అంటూ ఉంటే నాకు భయంవేసింది. ఎందుకు, నన్ను విడువనని, ఈయన యింతమందికి ఇన్నిసార్లు చెప్పాలి. నన్ను విడిచిపెట్టవలసిన అవసరం ఈయనకు కలగటం లేదుగదా! ఈ ఆలోచన నాకు తట్టగానే, నా శరీరం కంపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. చివరికి నాభయం నిజమే అయింది. నా యజమాని ఆర్థికంగా చితికిపోవటం వల్ల నన్ను అమ్మటం తప్పనిసరైంది. ఒకరోజున నన్ను సంతకు తోలుకు వెళ్ళాడు. అప్పటికి నాకొక పెయ్యదూడ కూడా. నేనూ నావెంట నాదూడా, యజమాని వెనక అడుగులో అడుగు వేసుకుంటూ బయలుదేరాం. నాబిడ్డ నడవలేకపోతే నా యజమానే దాన్ని సంతదాకా మోశాడు. బేరం చేసి కొన్నాడు. నన్ను కొనటం అంటే నన్ను, నా బిడ్డను కొన్నట్టే; నా బిడ్డకేం తెలుసు, ఈ బాధ? అది పసిది. దానికి ఎంతో మంది రైతులూ, ఎంతో మంది స్వజాతీయులూ ఒక్కసారిగా కనబడటం సంతోషకారణం అయింది. చేతుల్లో నిలవకుండా గంతులు వేయటం మొదలుపెట్టింది. దాని అమాయకత్వానికి నా గుండె చెరువు అయింది. కాని నేనేం చెయ్యగలను! నాబాధ దానికి ఎలా వెళ్ళబోసుకోను! నన్ను తీసుకు వెళ్ళడానికి నాకొత్త యజమాని నా మెడ పలుపు పట్టుకున్నాడు. నేను నా పాత యజమాని వంకకు దీనంగా చూశాను. ఆయన కళ్ళు చెమ్మగిల్లటం చూశాను. ఆయన వేదనకు దా కడుపు తరుక్కొని నేను మాత్రం ఏం చెయ్యగలను? నాకాయనతో వున్న ఋణానుబంధం తెగిపోయింది—అనుకున్నాను. నా కొత్త యజమానివెంట బయలుదేరాను. నాతోపాటు నాబిడ్డకూడా బయలుదేరింది. రేతులు మారటంతో వచ్చే యాతన దానికేం తెలుసు? రాబోయే రోజులు

ఎలా వుంటవో—అని నేను అవురుమంటూ వుంటే, అది వున్నచోట వుండకుండా చెంగలించింది.

మేము మా కొత్త యజమాని కొట్టంలోకి వచ్చాం. ఇక మా పరిస్థితులన్నీ తారుమారైనై. మా కొత్త యజమాని, మమ్మల్ని ఇంటింటికి తోలుకొని వెళ్ళి, పాలు పిండి, అమ్ముకుంటూ వుండేవాడు. మొదట్లో నా బిడ్డకు ఒక పక్క విడిచిపెట్టేవాడు. నెమ్మదిగా అదికూడా లేకుండా చేశాడు. నా బిడ్డను చేపుకు వదలగానే అది ఆకలిమీద వుండేదేమో 'అవురు, అవురు' మంటూ రివ్వున పరుగెత్తుకొని వచ్చేది. అది దగ్గరకు వచ్చే టప్పటికి నా వళ్ళు జలదరించి, పాలు చేపుకు వచ్చేవి. కాని నాబిడ్డను పాలు త్రాగనిచ్చే దెవరు? చేపుకు వచ్చిన పాలు, త్రాగనివ్వకుండా, నా యజమాని నా బిడ్డను బలవంతంగా గుంజుకువెళ్ళి కట్టివేసేవాడు. నోటి దగ్గరకు వచ్చిన పాలకు దూరమై అది గిజ గిజ తన్నుకుంటూ వుంటే, నా ప్రాణాలు విలవిలలాడేవి. నేను ఎందుకుపుట్టానో, ఎందుకు పాలనిస్తున్నానో, ఎందుకు బ్రతుకుతున్నానో నాకు అర్థం అయ్యేదికాదు. నా యజమాని నా పాలను పితికి, అమ్ముకొని డబ్బు సంపాదించడం తప్పని నేను యెప్పుడూ అనుకోలేదు. కాని నా బిడ్డసంగతి ఏమిటి? బిడ్డకు బ్రతికే అర్హత లేదా? తల్లిపాలను రుచిచూచే భాగ్యానికే, అది నోచుకోలేదా? నా బిడ్డను సాకుకునే అదృష్టం లేని తల్లిని నేనేం తల్లిని?

పాలులేక, ఆహారంలేక, నా బిడ్డ నా కళ్ళముందే నీరసించిపోయింది. చిక్కి వరుగై పోయింది. నేనే గుర్తుపట్ట లేకపోయాను. ఒక రోజు నా బిడ్డ నాతో రాలేదు. ఎందుకా అని ఆలోచించాను. ఈ విధంగా తల్లినీ, బిడ్డనీ విడదియ్యడం ఎంతో అన్యాయం. నాలుగురోజులు గడిచినై, నా బిడ్డ కొట్టంలోకూడా లేదు. నాకు కంపరం పుట్టింది. కంపరంతో, కోపంతో పాలివ్వకుండా ఎగచేపుకున్నాను. అందుకు నన్ను నాయజమాని నిర్దాక్షిణ్యంగా చావమోదాడు. ఏమైనా సరే. పాలు ఇవ్వగూడదు. ప్రాణాలు తెగించి నిలబడ్డాను. మరునాడు నా యజమాని నాతోపాటు ఒకదూడను మోసుకొని వచ్చాడు. అది నా బిడ్డేనని నేను మురుసుకున్నాను. నేను

దెబ్బలుతింటే తిన్నాను—ఫలితం దక్కిందని సంతోషించాను. నాకు బంధంవేసి, నా బిడ్డను పొదుగు దగ్గరకు తీసుకువచ్చాడు నా యజమాని. నాకు వొళ్ళు పొంగింది. పరవశమయ్యాను. కాని ఇదేమిటి? ఇదేం స్పర్శ? ఆ నా పొదుగును తాకిందో లేదో నేను రహస్యం గ్రహించాను. అది గడ్డి దూడ, దానికి ప్రాణంలేదు. నా బిడ్డ తిండికి లేక అది అప్పుడే మరణించింది. నేను పాలివ్వటంలేదని, ఈ గడ్డిదూడను కుట్టి, తీసుకువచ్చాడు నా యజమాని. నేను గ్రహించలేను అనుకున్నాడు. ఏమి దారుణం? తనబిడ్డ స్పర్శ గ్రహించలేని తల్లి వుంటుందా? నా శరీరం భుగభుగ ఉడికింది. నా పాలమీద బ్రతికేహక్కు నాబిడ్డకు లేకపోయింది. నా బిడ్డను నా పాల తడితో బ్రతికించుకునే యోగ్యత నాకు లేకపోయింది. ఇంక నన్నిలా కృశించి మరణించనివ్వండి. ప్రస్తుతం మరణంకోసం యెదురుచూస్తూ, కాలం గడుపుతున్నాను. నేను చచ్చేం; బ్రతికేం? ప్రపంచం యేమయి పోతే నాకేం?